క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

కేశంపేట: మండల పరిధిలోని సుందరాపురం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాములునాయక్, క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, యారం భాస్కర్‌రెడ్డి, అంజిరెడ్డి, చిన్నపురెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి, పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేగూరులో ఆస్పత్రి నిర్మించాలని వినతి



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందిస్తున్న శివశంకర్‌గౌడ్

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో 30 పడకల ఆస్పత్రిని నిర్మించాలని, దీంతో పాటు శిథిలావస్థకు చేరిన పాఠశాలను కూల్చివేసి మరో పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ గురువారం వినతిపత్రం అందించారు. చేగూరు సమీపంలోని కాన్హా శాంతివనానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రిని కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. చేగూరు పరిసర ప్రాంతాల్లో అనేక గ్రామాలు ఉన్నాయని, దీంతో పాటు సమీపంలోనే సింబాయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీ ఉందని గుర్తుచేశారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవినాయక్



రవినాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొత్తూరు: సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరు తండాకు చెందిన పాత్లావత్ రవినాయక్‌ను రాష్ట్ర కమిటీ ఎన్నుకుందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జనగాంలో జరిగిన సమావేశంలో భాగంగా తనను రాష్ట్ర కమిటీ సభ్యులు సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, జాతీయ నాయకుడు లక్ష్మణ్‌నాయక్, ప్రేమ్‌చంద్, చిన్నబాబు, సంజీవ్, లక్పతినాయక్, వినోద్, అఖిల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు తులసీకృష్ణ, శేఖర్‌గౌడ్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అదేవిధంగా నూతనంగా పాఠశాలకు వచ్చిన రాములు, పరమేశ్వరిలకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సునిత, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు బంగారు రాములు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

షాబాద్: వినాయకుల నిమజ్జనాల కోసం షాబాద్ పహిల్వాన్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించినట్లు షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపారు. గురువారం షాబాద్ పహిల్వాన్ చెరువును ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఏ విధంగా చర్యలు చేపట్టాలన్న విషయంపై మాట్లాడారు. అదేవిధంగా చెరువులోకి విగ్రహాలు వచ్చే రహదారి, ఇతర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని చెప్పారు. చెరువు వద్ద లైటింగ్ వేయాలని విద్యుత్ ఏఈ నరేందర్‌నాయక్‌కు సూచించారు. వినాయక నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

అద్దెకు దొరకని అరక

- యాంత్రీకరణ పెరిగినా అరకతోనే కలుపుతీత
- కాడెడ్లు తగ్గడంతో పెరిగిన డిమాండ్
- కలుపు తీసేందుకు రైతుల పాట్లు



మల్లారెడ్డిగూడలో కాడెడ్లతో పత్తిలో దంతె కొడుతున్న రైతు

షాబాద్: మారుతున్న కాలానికి అనుగుణంగా జిల్లాలో యంత్రసాగు పెరిగింది. వ్యవసాయంలో వాటి వినియోగం పెరగడంతో కాడెడ్లు కనుమరుగవుతున్నాయి. గత నెలలో ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు పంట చేలలో కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో రైతులు కలుపుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. కలుపు నియంత్రణకు కూలీలతో పాటు దంతె కొట్టేందుకు అరకల కోసం వెతుకుతున్నారు. దీంతో కాడెడ్లు ఉన్న అరకలకు డిమాండ్ పెరిగింది. దుక్కి దున్నడంతో మొదలు, పంట ఇంటికి చేర్చే వరకు ట్రాక్టర్ల వినియోగం పెరిగినా ఒకదశలో కాడెడ్ల అవసరం తప్పడంలేదు. యంత్రాలు ఎన్ని వచ్చినా అరకకు మాత్రం డిమాండ్ తగ్గడం లేదు. పత్తి విత్తాలన్నా అరకతో సాళ్లు పట్టాల్సిందే. పత్తిలో కలుపు నివారణకు కూడా దంతె కొట్టాల్సిందే. నారుమడి కలియ దున్నాలంటే అరక కావాల్సిందే. నాటు వేసేందుకు జంబు కొట్టాలన్నా కాడెడ్ల అవసరం తప్పనిసరని చెబుతున్నారు.

రూ.1,500 నుంచి 2వేల వరకు వసూలు..

జిల్లాలో 18.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా ఇందులో ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్న సాగు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు పత్తిచేలలో కలుపు మొక్కలు పెరిగాయి. వారం రోజులుగా ఎండలు కొడుతుండడంతో రైతులంతా కలుపుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. ఆలస్యమైతే పంట ఎదుగుదల లేకుండాపోతుంది. మళ్లీ వర్షాలు కురిస్తే కలుపు తీయడం, ఎరువులు వేసుకోవడం కుదరదు. దీంతో ఇటు కూలీలలతో పాటు అటు దంతె కొట్టేందుకు అరక కోసం వెతుకుతున్నారు. అరక కూలీ రోజుకు రూ.15 వందల నుంచి 2 వేల వరకు తీసుకుంటున్నారు.

గ్రామాల్లో తగ్గిన కాడెడ్లు...

ఒకప్పుడు ఏ రైతు ఇంటి ముందు చూసినా కాడెడ్లు, ఎడ్లబండ్లు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం 70 శాతం మంది రైతుల ఇళ్లముందు ఎడ్లబండ్లకు బదులు ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా దిగుబడులు పెంచుకోవడం, శ్రమ తగ్గించుకోవడం, సమయం ఆదా చేసుకునేందుకు యంత్రాల సాగు చేస్తున్నారు. చేను చదును నుంచి మొదలుకొని దిగుబడి వచ్చిన పంట అమ్మకానికి మార్కెట్‌కు తరలించే వరకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. దీంతో కాడెడ్లకు మేతతో పాటు వాటి ఆలనాపాలన చూసుకోవడం వీలుకావడం లేదని చెబుతున్నారు. దీంతో చాలా మంది రైతులు ఎడ్లను అమ్ముకొని ట్రాక్టర్లు విక్రయించేందుకు ముందుకు వస్తున్నారు. కానీ ఒకానొకదశలో వాటి అవసరం తప్పడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పత్తి చేలలో చెట్ల మధ్య దంతె కొట్టాలంటే ట్రాక్టర్లతో వీలుకాదు. చెట్లు విరిగిపోవడం, టైర్ల కిందపడి నలిగిపోవడం జరుగుతుంది. ఈ సమయంలో కాడెడ్లతో దంతె కొట్టడం సులభతరంగా ఉంటుందని రైతులు అరకనే ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఆలస్యమైతే పంట ఎదగదు



గత నెలలో కురిసిన వర్షాలకు పత్తిలో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. అరక అయితే సాళ్ల మధ్యలో ఉన్న గడ్డిపోతుంది. ట్రాక్టర్‌తో అయితే మొలకలు పాడవుతాయి. గతంలో కాడెడ్లు ఉండే. వాటిని అమ్మి ఇప్పుడు అరక కోసం తిరగాల్సి వస్తోంది. ఆలస్యమైతే గడ్డి పెరిగి పంట ఎదగదు.

–బండ నర్సింహారెడ్డి, రైతు, మన్మర్రి

ముందే పైసలిస్తున్నారు



పత్తి విత్తనాలు విత్తడానికి, సాళ్లు పెట్టేందుకు, వరి నారుమడి సిద్ధం చేయడానికి, పత్తిలో కలుపు నివారణకు దంతెలు కొడుతున్నాం. మా గ్రామంలో చాలా మంది రైతుల దగ్గర ఎడ్లు ఉండడంతో దంతె కొట్టడానికి రైతులు ఎక్కువగా అడుగుతున్నారు. అరక కావాలని నాలుగు రోజుల ముందే పైసలు ఇచ్చి వెళ్తున్నారు.

–అంజయ్య, రైతు, మక్తగూడ

'ట్రాఫిక్'పై అవగాహన పెంచుకోవాలి

రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ బాలాజీ

మొయినాబాద్: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. మండల పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం 'రహదారి భద్రత'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే విషయాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి చూపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా ప్రమాణాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, వేగనియంత్రణ పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను బాధ్యతగా తీసుకొని ఇతరులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ బిల్లా, ట్రాఫిక్ ట్రైనర్ వెంకట్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

కేశంపేట: మండల కేంద్రమైన కేశంపేటలో గురువారం మైసమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, రమణయ్య గౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అమ్రేష్, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- కుటుంబ నిర్ధారణకు సహకరించాలి
- మండల వ్యవసాయ అధికారి అనురాధ



రైతుల వివరాలు సేకరిస్తున్న అధికారి అనురాధ

మొయినాబాద్‌రూరల్: రుణమాఫీ వర్తించని ప్రతీ రైతు కుటుంబ నిర్ధారణ చేపడతామని అందుకు రైతులందరూ సమన్వయంగా వ్యవహరించి సహకరించాలని మండల వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు. కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో అధికారి అనురాధ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 598 మంది కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉందని ఆమె తెలిపారు. అందులో భాగంగా మొదటిరోజు నక్కలపల్లి గ్రామంలో ప్రారంభించామన్నారు. అధికారులు తమ ఇంటి వద్దకు వచ్చినప్పుడు 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఉండాలన్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని ప్రతి ఒక్కరి కుటుంబ నిర్ధారణ చేస్తామని తెలిపారు. రైతులు అధికారులకు ఆధార్‌కార్డు చూపించాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలకు ఫోన్ ద్వారా సమాచారం అందించి వివరాలు సేకరిస్తామని ఆమె పేర్కొన్నారు. ఇందుకుగాను మండలంలో వ్యవసాయ శాఖ ద్వారా రెండు వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయని ఒకటి మొయినాబాద్ క్లస్టర్ కాగా ఈ క్లస్టర్‌లో అధికారి సునిల్ ఉంటారని ఈ క్లస్టర్ కింద రైతులు ఇతర సమాచారం కోసం 8184945806లో సంప్రదించాలని కోరారు. అదే విధంగా రెండో క్లస్టర్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి క్లస్టర్ సజ్జన్‌పల్లి గ్రామ సమీపంలో ఉందని ఈ క్లస్టర్‌లో కుమార్ అధికారి ఉంటారని ఈ క్లస్టర్ కింద వచ్చే రైతులు 6305920250లో సంప్రదించి అనుమానాలను ఇతర వివరాలను తెలుసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

'సీజనల్'పై అప్రమత్తత తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, గ్రామ కార్యదర్శులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రోజువారీగా పారిశుద్ధ్య పనులు, రోడ్లు, మురుగునీటి కాల్వను శుభ్రం చేయడం, దోమల నివారణకు ఫాగింగ్, నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం కార్యక్రమాలను నిరంతరంగా చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సురేందర్, మండల వైద్యాధికారి రేవతి, సీఐ హబీబుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వేములనర్వలో బీఎల్‌ఓల నుంచి వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

కేశంపేట: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ అజీం అలీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మండలంలో ఓటరు ఇంటింటి సర్వే కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

మొయినాబాద్‌రూరల్: దేశ భవిష్యత్‌ను రూపొందించడంలో సాంకేతిక విద్య ఎంతో ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందని హరే కృష్ణ మిషన్ యూత్ ఎంపవర్‌మెంట్ హైదరాబాద్ హెడ్ బ్రజా బంధుదాస్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జేబీ ఐఈటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని విద్యా సంస్థల కార్యదర్శి జే.వీ.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బంధుదాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్య ఎంతో విలువైనదని అందులో విద్యార్థులు నాలుగు సంవత్సరాల పాటు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇండియా పర్యూసా ఫ్రీడ్ యూనిట్ హెడ్ అభిషేక్ లీడ్, ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, క్యాంపస్ థియేటర్ రాజశేఖర్ రెడ్డి, డీన్ అడ్మిన్ డాక్టర్ సలావుద్దీన్, భాస్కర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, భాస్కర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుమన్ పట్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ



కొందుర్గు రైతువేదికలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ శోభారాణి

కొందుర్గు: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందుతుందని మండల వ్యవసాయాధికారి శోభారాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ఆమె మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ అందలేదని, వారందరికీ త్వరలోనే రుణాలు మాఫీ అవుతాయన్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మహిమూద్ షరీఫ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కళ్లల్లో సంతోషం

కాంగ్రెస్ పాలనలోనే రైతులకు న్యాయం జరుగుతుందని, ప్రస్తుతం రుణమాఫీ అయిన రైతుల కళ్లల్లో సంతోషం కనిపిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎల్కగూడ గ్రామంలో ఏఓ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుల రుణమాఫీపై మొబైల్ యాప్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజు హాజరై మాట్లాడుతూ.. ఏక కాలంలో రూ.2లక్షలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని రుణ విముక్తులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం



దూసకల్‌లో గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్: తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని దూసకల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామమూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, రేవతి ఆధ్వర్యంలో విద్యార్థులు తెలుగు పద్యాలు, దేశభక్తి గేయాలు, పాటలు, ఉపన్యాసాలతో అలరించారు. ఉపాధ్యాయులు తెలుగు భాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినయశీల, శైలజ, బుద్ధదేవ్, రెడ్యాలాల్, సంతోష్‌బాబు, సర్ఫరాజ్ అన్వర్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ పాఠశాలలో

పట్టణంలోని కాకతీయ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ప్రిన్సిపాల్ మల్లేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంఠస్త పద్యాలు, ఉపన్యాసాలు, తెలుగు పదాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణ, ఉపాధ్యాయులు నరేందర్, రాజేశ్వరీ, నీతు, విజయలక్ష్మి, రాజేశ్, త్రిపుర సుందరీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



మాట్లాడుతున్న బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేశ్



గోపికల వేషధారణలో చిన్నారులు

షాబాద్: మండల పరిధిలోని స్టార్‌గార్డెన్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీలతరెడ్డి మాట్లాడుతూ.. హైందవ ధర్మ పరిరక్షణ కోసం ఆవిర్భవించిన విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్ల పూర్తి చేసుకుందన్నారు. బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేశ్ మాట్లాడుతూ.. రామజానకీ రథయాత్రకు రక్షణగా స్థాపించబడిన బజరంగ్ దళ్ నేటికీ అనేక దేవాలయాలు, గోవులు, భూములను లవ్ జిహాద్ పాల్పడుతున్న దుర్మార్గులకు బుద్ధి చెప్పిందన్నారు. హిందూ యువతలో చైతన్యం తీసుకురావడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద యువ విభాగంగా ముందుకు సాగుతోందని, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా కృష్ణాష్టమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రూప్ డాన్స్‌లో మొదటి బహుమతి శ్రీ చైతన్య హైస్కూల్, రెండో బహుమతి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, మాంటిసోరి హైస్కూల్ పాఠశాల విద్యార్థులు మూడో బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యక్షులు భోజిరెడ్డి, రంగనాథ్, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, నాయకులు నారాయణ, పాండు, కిరణ్, రాము, సోమశేఖర్, మాణెయ్య, హరీశ్, వినయ్, ధనూష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

షాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ టీఎస్ నిరంతరం ఎంతో కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్‌యాదవ్, సామల మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్టీయూ షాబాద్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ ఉపాధ్యాయుడికి కష్టమొచ్చిన వెంటనే స్పందించి వారి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. 50 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు పీఆర్సీని సాధిస్తామన్నారు. ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డులు కూడా అతి త్వరలో తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా డేవిడ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా అంజయ్యను ఎన్నుకున్నారు. మండల అసోసియేట్ అధ్యక్షుడిగా ఖాజాపాషా, మహిళా అసోసియేట్ సుశీల, మహిళా కార్యదర్శిగా సునీత, కార్యదర్శిగా గోవింద్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి గోవర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, మొయినాబాద్ మండల అధ్యక్షుడు బందయ్యల చేతులమీదుగా నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.నర్సింలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మున్సిపల్ కమిషనర్ వెంకన్న



మాట్లాడుతున్న కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కమల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ వెంకన్న హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. యువత క్రీడల్లో రాణించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుపై శ్రద్ధ వహించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, క్రికెట్, చెస్, క్యారం, పరుగు పందెం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పావని, నర్సింహ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ సయ్యద నదిరా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్.రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు బంగ్లా భారతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

చికెన్ వ్యర్థాల సేకరణకు టెండర్

షాద్‌నగర్: మున్సిపాలిటీలో చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ ప్రక్రియ గురువారం ముగిసింది. చికెన్ వ్యర్థాల సేకరణ కోసం మున్సిపల్ అధికారులు టెండర్‌ను ఆహ్వానించగా ఆరుగురు టెండర్‌ను దాఖలు చేశారు. గురువారం టెండర్‌ను ఓపెన్ చేయగా.. హైదరాబాద్‌కు చెందిన ఖురేషి ట్రేడర్స్ మహ్మద్ ఖలీల్ రూ.35లక్షల 38 వేల 600లకు టెండర్‌ను దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకన్న తెలిపారు.